## క్రీడలకు ప్రోత్సాహం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని శెట్టిగుంట పంచాయతీ యానాదిపల్లె అరుంధతివాడలో యువకులకు క్రికెట్ కిట్ కోసం ఆదివారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి క్రికెట్ కిట్ కోసం రూ.20వేలు నగదు అందించారు. గ్రామాలలో క్రీడల ప్రోత్సాహానికి ఎప్పుడు ముందుంటామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.










# పరిపాలనలో సరికొత్త పుంతలు



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

- ప్రభుత్వాన్ని ప్రజలకు దగ్గరకు చేర్చిన సీఎం జగన్
- ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : పరిపాలనను సరికొత్త పుంతలు తొక్కిస్తూ ప్రజలకు ప్రభుత్వాన్ని దగ్గరకు చేర్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రకు నాంది పలికారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కొరముట్ల యూత్ సభ్యులు కొరముట్ల శేఖర్, రాజేంద్ర, రాజగోపాల్, వినోద్, జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో ముద్రించబడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వవిప్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లతో పోల్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుతం తాను ఇచ్చిన హామీలు 95శాతం నెరవేర్చి నిరూపించారన్నారు. విశ్వసనీయతకు సరికొత్త అర్థాన్ని ఇస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, జెట్పీటీసీ రత్నమ్మ, ఉప సర్పంచ్ తోట శివసాయి, సీహెచ్ రమేష్, నాగులు నాయుడు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామాపురం : మారుమూల గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు మోహన్ సిద్ధార్థ అన్నారు. మండలంలోని గువ్వలచెరువు గ్రామంలోని శ్రీ బాలాజీ విద్యానికేతన్ హైస్కూల్, నీలకంఠ్రావుపేట ఎంపీపీ ఉర్దూ పాఠశాలలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు మద్రాసు రాఘవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనుమడు డాక్టర్ మోహన్ సిద్ధార్థ, డాక్టర్ కావ్యలు, కడప సిద్ధార్థ న్యూరో కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి వివిధ వ్యాధులకు సంబంధించిన చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందించామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో బండారు తిమ్మారెడ్డి, రేఖం రామచంద్రయ్య, రెడ్డిబాబు, ముబారక్, సుబ్బయ్య, శీను, పాఠశాల యజమాన్యం, రెహనుమా బేగం, దర్బార్‌బాష, శివయ్య, రఘురాం, కుమార్, రేఖం అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం అందించడమే సంకల్ప యాత్ర ఉద్దేశం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : సంక్షేమమే సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగోతు రమేష్ నాయుడు, రాజంపేట అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్‌లు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నందలూరు, ఆడపూరు పంచాయతీలలో కో-ఆర్డినేటర్ కోడూరు ఆదినారాయణ అధ్యక్షతన వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు, రాంప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన గురించి దేశవ్యాప్తంగా అవగాహన కల్పించి పథకాలు అందని అర్హులకు పథకాలు అందేలా చేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నందలూరు గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు మోడపోతుల సుభాషిని, ఇబ్బు, ఈఓపీఆర్డీ సతీష్ కుమార్, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, బీజేపీ నాయకులు షబ్బీర్ అహ్మద్, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పుల్లంపేట : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక ఎంఆర్‌సీ ఆవరణలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.సుబ్రమణ్యం రాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం రాజు మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పురుడు పోసుకున్నప్పటి నుంచి ఉపాధ్యాయ సమస్యలను పోరాటాలతో ఎస్టీయూ పరిష్కరించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, రీజనల్ కన్వీనర్ సుబ్బారెడ్డి, రీజనల్ నాయకులు నరసింహ, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, రాజంపేట, పుల్లంపేట, పెనగలూరు, నందలూరు మండలాల నాయకులు పాల్గొన్నారు.









## ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ సుబ్బారెడ్డి

పెనగలూరు (ఓబులవారి పల్లె) : ఆటో డ్రైవర్లకు ఆదివారం పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ సుబ్బారెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. బస్టాండ్‌లో వాహనాలు పెట్టుకునేటప్పుడు క్యూ లైన్‌లో రాజంపేట, ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు సమన్వయంతో ఉండాలన్నారు. ఎవరైనా తప్పిదాలు చేస్తే అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.







# నిరుపయోగంగా సబ్సిడీ వ్యవసాయ పరికరాలు



నిరుపయోగంగా ఉన్న ఒంటిమడక యంత్రాలు, తేనె తయారీ యంత్రాలు

గుర్రంకొండ : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సబ్సిడీ వ్యవసాయ పరికరాలు మూలనపడ్డాయి. గిరిజనులు తేనె తయారీ కోసం వినియోగించే యంత్రాలు కార్యాలయంలో తుప్పు పడుతున్నాయి. రైతులకు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయడానికి వ్యవసాయ యంత్రాలు నాలుగేళ్ల క్రితం స్థానిక వెలుగు కార్యాలయానికి వచ్చాయి. మొత్తం 13 ట్రాక్టర్‌తో దున్నే ఒంటిమడకలు మంజూరయ్యాయి. ఒక్కో మడక విలువ రూ.14.666 కాగా అందులో 50 శాతం సబ్సిడీ ఉంటుంది. నిబంధనల మేరకు సబ్సిడీ పోను ఒక్కో రైతు రూ. 7330 చెల్లించాలి. వెలుగు గ్రామసమాఖ్యల ద్వారా వీటిని అవసరమైన రైతులకు పంపిణీ చేసేందుకు అధికారులకు అప్పట్లో ఆదేశాలు వచ్చాయి. అయితే కిందిస్థాయి సిబ్బంది వీటిని రైతులకు విక్రయించడంలో శ్రద్ధ చూపించడం లేదనే విమర్శలున్నాయి. దీంతో ఇవి వెలుగు కార్యాలయంలో ఓ మూలన పడి ఉన్నాయి. వీటితోపాటు గిరిజనలకు ఉపాధి కల్పించడం కోసం తేనె తయారి చేసే యంత్రాలు అప్పట్లో మంజూరయ్యాయి. 75 శాతం సబ్సిడీతో వీటిని పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఏళ్ల గడుస్తున్నా అధికారులు వీటి గురించి పట్టించుకోవడం లేదు. దీంతో వెలుగు కార్యాలయంలో ఓ మూలన వీటిని పడేశారు. వీటిని ఇలాగే వదిలేస్తే తుప్పు పట్టే అవకాశముంది. అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు చేపట్టాల్సి ఉంది.

## భక్తిశ్రద్ధలతో జలాదివాసం



ఆదిశంకరాచార్యుల మూలవిరాట్‌ను జలాదివాసం చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు : పట్టణంలోని కొత్తకోడూరులో నూతనంగా నిర్మిస్తున్న ఆది శంకరాచార్యుల మఠ ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసే ఆది శంకరాచార్యుల మూలవిరాట్ మూర్తిని ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జలాదివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి నెల 12, 13, 14 తేదీలలో వైభవంగా ప్రతిష్టాపనా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా మూలమూర్తిని మండలం రోజులు జలాదివాసం, దాన్యాదివాసం చేయనున్నట్టు పేర్కొన్నారు. అలాగే పలు పరిచార దేవతలను ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు చిందుకూరి నరసింహాశర్మ, సురేష్‌కుమార్, రామ్మోహన్, రాయపెద్ది సతీష్, ప్రసాద్‌రావు, రాళ్ల సుబ్రమణ్యం, ప్రసాద్ పాల్గొన్నారు.




# కూచిపూడిలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న న్యాయాధికారి ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకటసుబ్బయ్య

మదనపల్లె సిటీ: కూచిపూడిలో మదనపల్లెకు చెందిన నాట్యశ్రీ లావణ్య గురుకులం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హైదరాబాదు గచ్చిబౌలిలో జరిగిన భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించి భారీ ప్రదర్శనలో కూచిపూడి విభాగంలో ఐన్యశ్రీ, శాశ్విత,లాస్యశ్రీ, జ్ఞాన సాయిశ్రీ,మనశ్వి, భావన,దీక్ష, తన్విత, దేవాజ్ఞ, పానవ్య, స్నేహలత, ధాన్యశ్రీ, భవ్య పాల్గొన్నారు. కళావైభవంలో జనుత స్తబ్దం౽కి లయబద్దంగా ఎంతో అద్భుతంగా కూచిపూటి నాట్యం ప్రద్శించారు ఇందుకుగాను వీరికి గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డును ప్రకటించి ధృవపత్రాలు పర్యవేక్షకులు గోపినాథ్ అందించారు. వీరిని స్థానిక బర్మావీధిలోని ఫంక్షన్ హాలులో ఆదివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. న్యాయాధికారి ప్రవీణ్‌కుమార్,ఎస్.ఐ వెంకటసుబ్బయ్యలు అభినందించారు. కార్యక్రమంలో నాట్య గురువు లావణ్య, చిన్నపిల్లల వైద్యులు గోపినాథ్, న్యాయవాది సోమశేఖర్, మోటివేటర్ రామమూర్తి పాల్గొన్నారు.

## సారా విక్రేత అరెస్ట్

మదనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. పట్టణంలోని కురవంకకు చెందిన వసలకిశోర్‌రెడ్డి(22), రెడ్డీస్ కాలనీలోని భాష్యం స్కూల్ సమీపంలో సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి 5లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షలు



నిరసన దీక్షలు చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : సమగ్రశిక్ష ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం ఉద్యోగులు డిమాండ్ చేశారు. 11వ రోజైన ఆదివారం కూడా కలెక్టర్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4 సంవత్సరాల క్రితం ప్రభుత్వం తమకిచ్చిన హామీలను నేటికి అమలు చేయకపోవడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే విద్యాశాఖలో విలీనం చేసి సమాన పనికి సమాన వేతనం అందజేయాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం తమ ఉద్యోగులకు కొందరికి ఇచ్చిన షోకాజ్ నోటీసులు, తొలగింపు ఉత్తర్వులను వారు మంటల్లో వేసి దహనం చేశారు.

## రాష్ట్ర కౌశల్ యోజనలో ప్రతిభ

మదనపల్లె సిటీ : విజయవాడ విజ్ఞాన భారతిలో జరిగిన కౌశల్ యోజన-2023 రాష్ట స్థాయి పోస్టర్ ప్రజెంటెషన్‌లో మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని బి.జయశ్రీ ×స్థిరమైన అభివృద్ధికి గ్రీన్ ఎనర్జీ౽ అనే అంశంపై ఆరవ స్థానం దక్కింది. ఎస్‌సీఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ సామినేని ఉదయభాను చేతుల మీదుగా మెమెంటో,రూ.1000 నగదును అందజేశారు. భాస్కరన్ గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. వీరిని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న జయశ్రీ(ఫైల్)






## క్లుప్తంగా

### విశేష పూజలందుకున్న అనంతపురం గంగమ్మ



**లక్కిరెడ్డిపల్లె :** మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ గంగమ్మ దేవత ఆదివారం భక్తులచే విశేష పూజలు అందుతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కాకుండా ఇతర మండలాలు, జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో పోటెత్తింది. ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీందర్ రాజులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులైన ఆదిమూలం వంశీయులు అనంతపురం గంగమ్మ దేవత దర్శనం కల్పిస్తూ అమ్మవారిని ప్రత్యేక అలంకరణలతో అర్చనలు, అభిషేక పూజలు నిర్వహింప చేశారు. అమ్మవారికి మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్‌గా ఆర్.నరసింహారెడ్డి



**రాయచోటి టౌన్ :** అన్నమయ్య జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్‌గా రావుల నరసింహారెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీని మరింత ప్రజల్లో బలోపేతం చేసేందుకు పని చేస్తానని చెప్పారు.

# రాయచోటి.. అభివృద్ధిలో మేటి

- కోట్ల రూపాయలతో ఆధునీకికరణ పనులు
- సంక్రాంతిలోపు పూర్తికానున్న నగరవనం
- రూ.1.15 కోట్లతో ఎస్ఎన్ కాలనీలో టవర్ క్లాక్



చిత్తూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధి నమూనా చిత్రం

**రాయచోటి టౌన్ :** రాయచోటి పట్టణ ఆధునీకికరణ దిశగా అడుగులు పడుతున్నాయి. సుందరీకరణతో పాటు ఆధునీకికరణ, అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. అందుకోసం అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రణాళికలను అధికారులతో కలిసి రూపొందించారు. పనులకు కావాల్సిన నిధులను కూడా ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. రాయచోటి పట్టణంలో ప్రధాన కూడళ్ల వద్ద సర్కిళ్లు, టవర్ క్లాక్ ఏర్పాటుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాయచోటి పట్టణంలో ప్రధానంగా ఆరు కూడళ్లను ఎంపిక చేసి ఆ ప్రదేశాలలో డిజైన్ల అప్రూవల్ పొంది కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల నిధులతో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రెండు, మూడు నెలలో పనులు పూర్తి చేసేందుకు సిద్ధమయ్యారు. అలాగే ఎస్ఎన్ కాలనీలో రూ.1.15కోట్లు టవర్ క్లాక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆరు ప్రధాన సర్కిళ్లలో చిత్తూరు రింగ్ రోడ్డు వద్ద, నేతాజీ సర్కిల్ వద్ద, షాదీఖానాకు ఎదురుగా ఉన్న డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహం వద్ద, మాసాపేట – వేంపల్లె సర్కిల్ వద్ద, దిబ్బల బడి సర్కిల్, ఎన్‌జీఓ కాలనీ సర్కిల్ వద్ద సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. అలాగే పట్టణంలో నాలుగు వరుసల రోడ్లు ఏర్పడిన తరువాత చెన్నముక్కపల్లె రోడ్డు, గున్నికుంట్ల క్రాస్, దిగువ అబ్బవరం క్రాస్ వద్ద కూడా ఆధునికరించనున్నారు. రూ.50 లక్షలతో రింగ్ రోడ్డు నుంచి ఎంఐజీ లే అవుట్ వరకు విద్యుత్ దీపాల వెలుగును ఏర్పాటు చేయనున్నారు. సుండుపల్లె మార్గంలోనూ నాలుగు రోడ్ల పనులు పూర్తి కావచ్చాయని ఈ రోడ్డుకు కూడా లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ వారి సహకారంతో రూ.1.30 కోట్లతో క్రికెట్ స్టేడియానికి డబుల్ రోడ్డు, రూ.70 లక్షలతో గ్యాలరీ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అలాగే నగర వనం పనులు సంక్రాంతిలోపు పూర్తి చేయాలని చెప్పారు. ఎస్ఆర్ కల్యాణ మండపం నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు 7 కిలో మీటర్ల మేర నాలుగు వరసల జాతీయ రహదారి పనులు మున్సిపల్ పాలకవర్గ సభ్యుల సహకారంతో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. నారాయణరెడ్డి పల్లె వద్ద లే అవుట్‌ను త్వరలో స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ పరిధిలోకి తీసుకొంటామని, అలాగే చెన్నముక్కపల్లెను కూడా విలీనం చేసుకొని కార్పొరేషన్ స్థాయికి మున్సిపాలిటీని తీసకెళ్లతామన్నారు.

## వైఎస్సార్‌సీపీ మండల కమిటీలు నియామకం

**ఓబులవారిపల్లె :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైఎస్సార్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేర ఓబులవారిపల్లె, పెనగలూరు మండలాలకు సంబంధించి వివిధ కమిటీలను నియమించారు. ఈ మేరకు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదల అయ్యింది. ఓబులవారిపల్లె వైఎస్సార్ పార్టీ మండల అధ్యక్షుడిగా వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లెం ఈశ్వరయ్య, కె.సుధాకర్ నాయుడు జనరల్ సెక్రటరీలుగా కె.నారాయణ రెడ్డి, ఒ.అమరనాథరెడ్డి, ఎం.రవిచంద్ర, ట్రెజరర్‌గా ఐ.మణిరాజు, సెక్రటరీలుగా బి.రెడ్డికుమార్, సి.జయదుర్గారెడ్డి, వెండికట్ల మౌలాలి, సుబ్బరాయుడు, జి.వెంకటరామరాజు, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా కొప్పల శేఖర, జి.బాలాజీ, జి.ఆదినారాయణ, ఎం.వెంకటసుబ్బయ్య, బి.రమణయ్య, యు.చిన్న సిద్దూ సాహెబ్, సాంబశివరాజు, ఎం.ఈశ్వర్ రాజు, వై.నరసింహారెడ్డి, ఏ.ఈశ్వరయ్య, వంకన దిలీప్ కుమార్ రెడ్డి, ఎం.దేశయ్య, ఎస్.సుభాన్, వెంకటస్వామి, పి.జయవర్ధన్ రెడ్డిలను నియమించారు. పెనగలూరు వైఎస్సార్ పార్టీ మండల అధ్యక్షుడిగా కేతా చక్రపాణి, వైస్ ప్రెసిడెంట్లుగా రెడ్డయ్య నాయుడు, ఆర్.వెంకటేశ్వరరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా ఆకుల లక్ష్మీ నరసింహులు, బి.శేషారెడ్డి, బుజ్జిరెడ్డి యానాదిరెడ్డి, ట్రెజరర్‌గా పెంచలయ్య, సెక్రటరీలుగా పి.రమణ, కె.హరిప్రసాద్ నాయుడు, టి.తిరుపయ్య, కె.మనోహర్ రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా కె.శ్రీకాంత్ రెడ్డి, జి.సుబ్బానాయుడు, ఎ.శంకరయ్య, కె.జయచంద్రరాజు, పి.నారాయణ, లింగం చిన్నయ్య, కె.విజయభాస్కర్ రెడ్డి, ఆర్.మల్లికార్జున, శివప్రసాద్ నాయుడు, యు.చెంగల్ రాజు, జి.వెంకటేష్, గుండ్లూరు వెంకటేష్, పి.రామాంజులు, ఎం.వెంకటరమణ, ఎస్.వెంకటేష్‌లను కమిటీ సభ్యులుగా నియమించారు.

### బస్సు, స్కూటర్ ఢీ

**గాలివీడు :** మండల పరిధి వెలిగల్లు గ్రామం వైఎస్సార్ వెలిగల్లు రిజర్వాయర్ ఎడమ కాలువ సమీపంలో ఆదివారం బస్సు, స్కూటర్ ఢీ కొంది. స్థానికుల వివరాల మేరకు కదిరి నుంచి రాయచోటికి వస్తున్న బస్సు గాలివీడు నుంచి సత్యసాయి జిల్లా తలుపుల మండలం జ్యోతులపల్లె తండాకు చెందిన నాగరాజు నాయక్ ద్విచక్రవాహనంలో వెళ్తుండగా మార్గమధ్యలోని వైఎస్సార్ వెలిగల్లు రిజర్వాయర్ ఎడమ కాలువ సమీపంలో ఢీ కొనడంతో స్కూటరిస్టు నాగరాజుకు కాలు విరిగింది. బాధితుడిని చికిత్స నిమిత్తం 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మండల ఎస్ఐ వెంకట శివకుమార్ తెలిపారు.

### సారా విక్రేత అరెస్ట్

**మదనపల్లె :** సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. పట్టణంలోని కురవంకకు చెందిన పసల కిశోర్‌రెడ్డి(22), రెడ్డీస్‌కాలనీలోని భాష్యం స్కూల్ సమీపంలో సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి వద్ద నుంచి 5లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

## అంబరాన్నంటిన నూతన సంవత్సర వేడుకలు

**ఓబులవారిపల్లె :** నూతన సంవత్సరం వేడుకలు ఆదివారం మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. యువకులు నూతన సంవత్సర కేక్ కట్ చేసుకొని ఒకరికొక్కరు తినిపించుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా ఈ వేడుకలు నిర్వహించుకున్నారు. నేడు ఈ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బట్టల షాపులు, స్వీట్స్ అండ్ బేకరీలు, పూలు, పండ్లు దుకాణాలు కస్టమర్లతో కిటకిటలాడాయి.

**కేకుల కోసం ఎగబడుతున్న యువత**

**పెనగలూరు (ఓబులవారిపల్లె) :** నూతన సంవత్సర వేడుకలకు మండలంలో కేకుల కోసం యువత ఎగబడ్డారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి వచ్చి కేక్‌లను కొనుగోలు చేసి తీసుకువెళ్లారు. ప్రతి వీధిలో కేక్‌ను కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను జరుపుకునేందుకు యువత ఉత్సాహం చూపించారు. దీంతో స్వీట్ షాపుల వద్ద యువకుల సందడి వాతావరణం కనిపించింది.



పెనగలూరులో కేక్‌ల కొనుగోలు చేస్తున్న యువకులు

## ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టిన పోలీసులు

**నందలూరు(రాజంపేట) :** మండల కేంద్రంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ కూడలిలో ఆదివారం రాత్రి ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అతి వేగంగా, అధిక శబ్దంతో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. కొత్త సంవత్సల వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు మహేంద్ర, దర్బార్, దిలీప్, రవితేజలు పాల్గొన్నారు.

**ప్రశాంతంగా జరుపుకోవాలి**

**పెనగలూరు (ఓబులవారిపల్లె) :** మండలంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని పెనగలూరు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను మద్యంసేవించి అతివేగంగా వాహనాలు నడుపుకుంటూ వెళ్లకూడదన్నారు. ముఖ్యంగా యువత నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న ఎస్ఐ

## పాడి రంగం వృద్ధికి ప్రాధాన్యం

**చిట్వేలి :** మండలంలో పాడి రంగం వృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పశు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు చిట్వేలి ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ కె.డి.వరప్రసాద్ తెలియజేశారు. గోపాలమిత్ర వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆదివారం కెకె వడ్డిపల్లి పాడిరైతులు నిర్వహించిన నూతన సంవత్సరం వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పాడి అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. అవసరమైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు అందించేలా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2024లో పిడుదులు, ఏలికపాముల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. గాలికుంటు వ్యాధి నివారణకు 2024, జనవరి 2వ తేదీ నుంచి జాతీయ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఏడీ తెలియజేశారు. మండల ఆదర్శ పాడిరైతు పెంచలయ్య, పాలకేంద్రం శంకరయ్యలు కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పశు సంవర్ధకశాఖ వారు పిడుదుల నివారణ మందులు, లివర్ టానిక్‌లు, మినరల్ మిక్షర్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈఓ నాయక్, గోపాల మిత్రలు శివప్రసాద్, నరసింహులు, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు కేక్ తినిపిస్తున్న ఏడీ వరప్రసాద్







### కార్మికుల సంఖ్య పెంచాలి



నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

**రాయచోటి అర్బన్ :** పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మెలో భాగంగా ఆదివారం ఉదయం కార్మికులు పురవీధులలో ర్యాలీని నిర్వహించి జాతీయ రహదారిపై మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని కనీస వేతనం రూ.26వేలకు పెంచాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు వెంకటేశు, రైతుసంఘం నేత వంగిమళ్ళ రంగారెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు కేశవరావు, అక్షిత్‌కుమార్, వెంకటలక్ష్మి, వెంకటేష్, వెంకటలక్ష్మి, ఆదిలక్ష్మి, మహేష్, సుజాత, సరోజ తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నందలూరు(రాజంపేట) :** శ్రీ గోదాదేవి, శ్రీ మహాలక్ష్మీ దేవి సమేత శ్రీ ప్రసన్న రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పోస్టర్లను ఆదివారం శ్రీ సౌమ్య నాథస్వామి ఆలయంలో తిరుప్పావై భక్త సేవా సమితి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని జనవరి 7న ఆదివారం తోటా కల్యాణ మండపంలో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహోత్సవంలో భక్తాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఉచిత పాస్‌లకు 8897897875, 7032994384 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీ తిరుప్పావై భక్త సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీలు

**రాయచోటి అర్బన్ :** కార్మికుల సమస్యల పరిష్కారంలో పాలకులు అనుసరిస్తున్న మొండివైఖరిని వెంటనే విడనాడాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మలు కోరారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట సమ్మెలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సమ్మె చేపట్టి 20 రోజులవుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తామంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీకి సంబంధించి నేటికీ జీఓ విడుదల కాకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు విజయమ్మ, రామాంజులమ్మ, నాగమణి, అరుణ, మస్రూన్‌బీ, సుమలత, వనజ, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

### రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

**గుర్రంకొండ :** మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మ తల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు ఆలయం వద్ద అన్నదానం చేశారు. తమిళనాడు, కర్ణాటకతోపాటు రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు.

### సమస్యలు పరిష్కరించుకుందాం

**వాల్మీకిపురం :** విశ్రాంత ఉద్యోగులంతా ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకుందామని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శంకరయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేటవీధిలో ఏర్పాటు చేసిన తాలూకా విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఉమ్మడి పోరాటం చేస్తామన్నారు. మన సంఘంలో ఎవ్వరికైనా సమస్యలు తలెత్తితే, ఆ సమస్యలను విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తోందన్నారు. సంఘంలో సభ్యులకు ఏ సమస్యలున్నా సంఘం దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి సంఘం సభ్యులు అందరూ కలసి సమష్టిగా కృషి చేస్తామన్నారు.

## నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

**రాయచోటి టౌన్ :** పట్టణంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి తెలంగాణ రాష్ట్రానికి చెందిన దాతలు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన పుప్పాల అజయ్‌కుమార్, మణిరాజ్ వారి కుటుంబ సభ్యులు నిత్య అన్నదాన కార్యక్రమ నిర్వహణకు ఈ మొత్తాన్ని అందజేశారని తెలిపారు. వీరిని శాశ్వత అన్నదాన మహారాజ పోషకులుగా గుర్తించి వారికి రశీదును అందజేయడంతోపాటు వీరిన పేరున సంవత్సరంలో ఒక రోజు భక్తులకు అన్నదానం చేపడతామని తెలిపారు.

**అన్ని ఏర్పాట్లు సిద్ధం..**

నూతన సంవత్సరం సందర్భంగా ఆలయానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని దీని కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోలంరెడ్డి విజయ తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని పూర్తిగా శుభ్రపరిచి అందంగా అలంకరణ చేశామని చెప్పారు. అలాగే వేలాదిగా భక్తులకు స్వామి వారిని దర్శించుకోవడానికి వస్తారని వారికి కావాల్సిన తాగునీరు, అన్నప్రసాదం ఏర్పాట్లుకు సిద్ధం చేస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగనీయకుండా కావాల్సిన వసతి, ఇతర మౌలిక వసతులు కూడా కల్పిస్తున్నామన్నారు.



దాతలకు రశీదును అందిస్తున్న దృశ్యం

## క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

**చిట్వేలి :** రాజుకుంట పంచాయతీ, అనుంపల్లి నివాసి మాదినేని చంద్రశేఖర్ గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేక ఇంటి వద్దనే అవస్థలు పడుతుండేవాడు. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత కుమారుడు ముక్కా సాయివికాస్ రెడ్డి ఆదివారం బాధితుడు చంద్రశేఖర్ స్వగృహంలో పరామర్శించి రూ. 50 వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్, రమణరాజు, కిరణ్, సురేష్, పెంచలయ్య, స్థానికులు రామయ్య, సుధాకర్, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, రమేష్, నరసయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి చెక్కును అందజేస్తున్న ముక్కా సాయివికాష్ రెడ్డి, తదితరులు

## హార్సిలీహిల్స్ పారిశుధ్యంపై ప్రణాళిక

**బి.కొత్తకోట :** మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పారిశుద్ధ్య పనులు నిరంతం జరిగేలా, వ్యర్థాలను అధికంగా పారబోస్తున్న దానిపై ప్రణాళికను అమలు చేస్తామని మదనపల్లె ఆర్డీఓ, హార్సిలీహిల్స్ టౌన్ షిప్ కమిటీ చైర్మన్ ఎంఎస్ మురళీ అన్నారు. ఆదివారం డీఎస్పీ కేశప్ప, అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం పోలీసు, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. నూతన వేడుకల కోసం తరలివచ్చే వేలాది మందికి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు కార్లను స్పోర్ట్స్ స్థలంలో నిలిపి ఉంచాలని, వివిధ ప్రాంతాల నుంచి నడిచే ఆర్టీసీ బస్సులు ఎక్కడ పడితే అక్కడ నిలపకుండా ఇదే ప్రాంతంలో నిలపాలని, ఇక్కడి నుంచే బయలుదేరాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆది, సోమవారాల్లో ప్రకృతి ప్రాంతాల్లో విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏర్పాట్ల కోసం ఆర్డీఓ కాలినడక పరిశీలనలు నిర్వహిస్తుండగా గాలిబండ వద్ద రోడ్డుపై దుర్వాసన రావడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. తర్వాత ఎంపీడీఓ శంకరయ్యతో పారిశుద్ధ్య పనులపై చర్చించారు. డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ నూతన వేడుకల పేరుతో ప్రయివేటు అతిథి గృహాల్లో డీజే మ్యూజిక్, నిషేధిత నృత్యాలు, ప్రదర్శనలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ముఖద్వారం వద్ద సర్కిల్**

హార్సిలీ హిల్స్ ముఖద్వారం వద్ద అన్నమయ్య సర్కిల్ ఏర్పాటుపై ఆర్డీఓ మురళీ పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో బి.కొత్తకోట – మదనపల్లె రహదారి, ముఖద్వారం కలిపే మూడురోడ్ల మధ్యలో సర్కిల్ ఏర్పాటు చేసి అందులో అన్నమయ్య విగ్రహం ప్రతిష్టించేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ చెప్పారు. కార్యక్రమాల్లో సీఐ శివాంజనేయులు, ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, తహసీల్దార్ రఫీక్ అహ్మద్, ఎంపీడీఓ శంకరయ్య, ఆర్ఐ బాలాజీ, వీఆర్ఓ నరేంద్ర పాల్గొన్నారు.



హార్సిలీహిల్స్‌పై పరిశీలనలు చేస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ, అధికారులు

